క్లుప్తంగా

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు


మల్లూరమ్మను దర్శించుకుంటున్న భక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానదిపై కొలువై ఉన్న శ్రీ మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మ వారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

బెటాలియన్‌కు ఐరన్ రాక్‌లు, కంప్యూటర్‌ల వితరణ



సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌కు హెచ్‌పీసీఎల్ అధికారులు ఐరన్‌రాక్‌లు, కంప్యూటర్ సిస్టమ్‌లను ఆదివారం విరాళంగా ఇచ్చామని కడప హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ ఐరన్‌రాక్‌లను కంప్యూటర్ సిస్టమ్‌లను కమాండెంటు కె. ఆనంద రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్ ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, హెచ్‌పీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి


జయరామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం బండపల్లె గ్రామం పాత్తకూరుపల్లెలో ఆదివారం జరిగిన డెస్కో మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి సోదరుడు, సర్పంచ్ రవిశంకర్‌రెడ్డి తండ్రి సదిపిరాళ్ల జయరామిరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, హిందూపురం వైఎస్ఆర్‌సీపీ పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యంలు పాల్గొన్నారు. జయరామిరెడ్డి చిత్రపటం వద్ద వారు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనందరెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, వీవీ ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, గాలివీటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత




సుండుపల్లె : మండల పరిధిలోని గుల్లావాండ్లపల్లెకు చెందిన జ్యోతి(16) అనే అమ్మాయి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరు సెయింట్ జాన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఆ అమ్మాయి చికిత్సకు దాదాపు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని హాస్పిటల్ వారు చెప్పారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మానవత సంస్థ వారు చైర్మన్ గంగిరెడ్డి రూ.10 వేలు, సంస్థ సభ్యులు మొత్తం కలిపి రూ.17 వేలు అమ్మాయికి నగదు రూపంలో చికిత్స కోసం అందజేశారు.

పీవీఎన్ మాధవ్‌ను కలిసిన అరమాటి



రాయచోటి టౌన్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌ను రాయచోటి బీజేపీ సీనియర్ నాయకులు అరమాటి శివగంగిరెడ్డి మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేపీ సిద్ధాంతాలను బలపరుస్తూ పార్టీ బలోపేతానికి అందరం కలసికట్టుగా కృషి చేయాలని మాధవ్ సూచించారని అరమాటి తెలియజేశారు.

పూజలందుకున్న ఇరుగులమ్మ



సిద్దవటం : మండల కేంద్రం శివారులోని మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద వెలసిన శ్రీ ఇరుగులమ్మకు ఆదివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను జరిపించారన్నారు.

వంచనపై మండిపాటు.. దగాపై తిరుగుబాటు

- కూటమి పాలనలో సంక్షామం'
- వైఎస్ జగన్ చేసిన మంచిని వివరిద్దాం
- రైతులను విస్మరించిన చంద్రబాబు తీరును ఎండగడదాం
- కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

లక్కిరెడ్డిపల్లి : ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లిలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి నివాస ప్రాంగణంలో మండల స్థాయి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అతిథులుగా ఆర్. రమేష్ కుమార్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ తిమ్మిరెడ్డి ఉమాపతిరెడ్డి, మండల నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొని వైఎస్సార్ సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు నయవంచన చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్లు వేయించుకుని అవసరం తీరాక హామీలను గాలికి వదిలేశారన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వడం లేదని, 50 ఏళ్ల పింఛన్ ఇవ్వడం లేదని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా ఉద్యోగాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను దగా చేశారన్నారు. చంద్రబాబు మొదటి సంతకం మెగా డీఎస్సీలో 16 వేల టీచర్ పోస్టుల కోసం పెట్టారని, అదే జగన్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో 1.40 లక్షల శాశ్వత ఉద్యోగాలను కల్పించారన్నారు. 18 ఏళ్ల నుండి 59 సంవత్సరాల వయస్సు వరకు మహిళలకు నెలకు రూ. 1500లు ఇస్తామని మోసగించారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట వినూత్న కార్యక్రమాన్ని ప్రకటించారన్నారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు, సూపర్ సిక్స్ పథకాల అమలు విఫలమైందని ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. కూటమి ప్రభుత్వం పదునాలుగు నెలల పాలనలో ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని, మోసాన్ని వివరించాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సిపి అధినేత వైఎస్ జగన్ శ్రీకారం చుట్టిన బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల నాయకులు ప్రచారం చేయాలన్నారు. గ్రామ గ్రామానికి వెళ్లి అక్కడి స్థానిక నాయకులు, కార్యకర్తలను కలిసి ప్రచారం చేయాలని, ఆ గ్రామంలో రచ్చబండ ఏర్పాటు చేసి కూటమి పాలన వైఫల్యాలను వివరించాలన్నారు.

రాయచోటి అభివృద్ధి మన హయాంలోనే..

రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. తమ హయాంలో వెలిగల్లు నీటిని లక్కిరెడ్డిపల్లి మండలంలోని పందిళ్లపల్లి, కుర్నూతల, కస్తూరురాజుగారిపల్లి, మద్దిరేవుల, లక్కిరెడ్డిపల్లి, దిన్నెపాడు, బి.ఎర్రగుడి గ్రామాలలోని చెరువులను నింపామని తెలియజేశారు. కాలేటివాగు ప్రాజెక్టు పనులు నలభై శాతం పూర్తయ్యాయని, ఆ పనులు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఏడాది కాలంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు ఏ ఇబ్బంది జరిగినా తోడుగా నిలుస్తానన్నారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యల నివాసంపై దాడి చేశారని, అలాగే సంబేపల్లి మండలం నారాయణరెడ్డిపల్లి గ్రామంలో వారాది అనే బీసీ నాయకుడు హత్యకు గురయ్యాడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ 2.0లో కార్యకర్తలకు, నాయకులకు పెద్దపీట వేయడం జరుగుతుందని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు అంపాబత్తిన రెడ్డయ్య, తిమ్మిరెడ్డి ఉమాపతిరెడ్డి, ఉప మండల అధ్యక్షులు సమరసింహారెడ్డి, సుబ్బరాయుడులు ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మైనార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

పాలనలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం

ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి



పాలనలో కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌కుమార్ రెడ్డి అన్నారు. అధికార పార్టీ నేతలు రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నారన్నారు. రెడ్‌బుక్ పాలన సాగుతోందన్నారు. జగన్ మాటమీద నిలబడే వ్యక్తి అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం కనబడటంలేదు

జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో దాడులు తప్ప అభివృద్ధి, సంక్షేమం కనబడటంలేదని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తుండడం మంచి పద్ధతి కాదని తెలిపారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ పోస్టర్‌ను ప్రజల్లోకి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్దామన్నారు. సంక్షేమం మరిచి పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

స్పందించారు.. సరిచేశారు

వినాయకనగర్‌లో సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాజంపేట టౌన్ : పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రక్కన ఉన్న వినాయకనగర్‌లో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగేలా ప్రమాదకరంగా ఉండేవి. ఈ నేపథ్యంలో 'నేలకొరుగుతున్న నిర్లక్ష్యం' అన్న శీర్షికతో ఈనెల 26వ తేదీ 'సాక్షి' దినపత్రికలో వెలువడిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. వినాయక నగర్‌లోని సచివాలయం వద్ద రెండు, వినాయక స్వామి గుడి వద్ద ఒక విద్యుత్ స్తంభం నేలకొరిగేలా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇంతకు ముందు విద్యుత్ స్తంభాలు నేలకొరిగేలా ఉండటంతో ఆ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయానికి వచ్చే ప్రజలు, వినాయక స్వామి ఆలయానికి వచ్చే భక్తులు భయాందోళనకు గురవుతుండేవారు. ఇలాంటి పరిస్థితుల్లో 'సాక్షి' దినపత్రికలో కథనం వెలువడిన వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, భక్తులు, ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.


నాడు ప్రమాకరంగా ఉన్న విద్యుత్ స్తంభం


నేడు కొత్త స్తంభం ఏర్పాటు చేసిన విద్యుత్ అధికారులు

మిథున్ రెడ్డి అరెస్టు హేయమైన చర్య

- పెద్దిరెడ్డి కుటుంబంపై కుట్రలను ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును తప్పుబడుతూ శ్రేణుల నిరసన ప్రదర్శన


నిరసన ప్రదర్శనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

లక్కిరెడ్డిపల్లి : కూటమి నేతలు కుట్రలతోనే ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ లక్కిరెడ్డిపల్లిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేసిందన్నారు. మద్యం విక్రయాలలో ఎక్కడా అవినీతి జరగకపోయినా కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం మద్యం పాలసీని పారదర్శకంగా అమలు చేసిందన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం షాపులు కొనసాగాయన్నారు. ప్రభుత్వానికి ఆదాయం చేకూరితే కుంభకోణం అంటూ ఆరోపిస్తుండటం చంద్రబాబు కుటిల రాజకీయమని మండిపడ్డారు.

జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకొని అక్రమంగా అరెస్టులు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాజి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిపి ఉమాపతి రెడ్డి, గాలివీడు మాజీ ఎంపిపి జిల్లా సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపిపిలు సమరసింహారెడ్డి, సుబ్బరాయుడు, మాజీ ఉప మండల అధ్యక్షులు సిద్దక రామచంద్రారెడ్డి, యువ నాయకులు గజేంద్ర రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలపై అవగాహన కల్పిద్దాం


దాతలను సన్మానిస్తున్న మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : సమాజ సేవలతో పాటు విద్యార్థులకు నైతిక విలువలను నేర్పుతున్న సేవా సంస్థ మానవత సేవా సంస్థ అని వీఆర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం ప్రతిభా కళాశాలలో నెలవారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో సేవలతో పాటు విద్యార్థులలో లోపిస్తున్న నైతిక విలువలపై అవగాహన కల్పించి వారిలో నైతిక విలువలను నేర్పడం కూడా ఒక సేవేనన్నారు. పాఠశాలలో కేవలం మార్కుల కోసం విద్యను బోధించడం బాధేస్తుందన్నారు. శివగంగిరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులలో ప్రతిభతో పాటు నైతిక విలువలను గుర్తించి ప్రోత్సాహకంగా బహుమతులను, నగదు ప్రోత్సాహాన్ని అందిస్తున్నామని తెలిపారు. అనంతరం అధ్యక్షులు అంకం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆర్థిక సహకారం అందించిన వీఆర్ వెంకట్రామిరెడ్డి, దివ్యతేజ స్కూల్ యజమాని నాగేశ్వరావు, ఎస్ఆర్ కల్యాణ మండపం మేనేజర్ వలీ, సెల్ పాయింట్ యజమాని మస్తాన్‌లను సన్మానించారు.

వర్షాలు కురిపించు.. గంగమ్మా



లక్కిరెడ్డిపల్లి : రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండేలా వర్షాలు కురిపించి కాపాడు తల్లీ అంటూ ఆదివారం గంగమ్మకు భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ అనంతపురం గంగమ్మ దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. అంతకుముందు ఆలయ పూజారులు చెల్లు వంశీయులు అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, పరిమళభరిత పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. అమ్మవారికి పెద్ద ఎత్తున భక్తులు దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కళాశాల అభివృద్ధికి దాతలు సహకరించాలి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ హరిత

ఓబులవారిపల్లె : ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి దాతల సహాయ సహకారాలు ఎంతో అవసరమని ప్రిన్సిపల్ హరిత పేర్కొన్నారు. శనివారం కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందజేస్తున్నామన్నారు. కళాశాల మైదానంలో వర్షాలు కురిసి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయని, గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నాగినేని రమేష్‌నాయుడు సహకారంతో మొక్కలను తొలగించి అభివృద్ధి పనులు చేయించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ శారద, పారిశ్రామిక వేత్త నాగినేని రమేష్‌నాయుడు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు


అక్రమంగా జేసీబీతో తొలగించిన భారీ వృక్షం

పుల్లంపేట : ఒకవైపు ప్రభుత్వం మొక్కలను నాటండి.. పర్యావరణాన్ని కాపాడాలంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న అధికారులు చెట్లను అక్రమార్కులు యథేచ్ఛగా నరుకుతున్న పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇందుకు ఉదాహరణ కడప – చెన్నై జాతీయ రహదారి పుల్లంపేట బైపాస్ వద్ద ఎస్‌వీ కల్యాణ మండపం పక్కన భారీ వృక్షాన్ని జేసీబీ సహాయంతో తొలగించారు. ఆ స్థలం ఆర్‌అండ్‌బీ వారిది అయినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు చేసినా స్పందించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు


గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న ఎస్ఐ

పెనగలూరు : మండలంలోని ఆటో డ్రైవర్లకు ఆదివారం గుర్తింపు కార్డులు పంపిణీ చేసినట్లు ఎస్ఐ రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలకు సీరియల్ నెంబర్లు ఇచ్చామని తెలియజేశారు. అలాగే డ్రైవర్‌కు ఫొటోతో కల్గిన గుర్తింపు కార్డులు అందిస్తున్నామని, ఆ గుర్తింపు కార్డులో డ్రైవర్ల వివరాలు ఉంటాయన్నారు. ఆటో నడిపేటప్పుడు గుర్తింపు కార్డులను తప్పక కలిగి ఉండాలని తెలియజేశారు. అనంతరం డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కంటి రోగులకు ఆపరేషన్లు


కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 19 మంది రోగులకు ఆపరేషన్లు నిర్వహించినట్లు కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూప గుప్తా తెలిపారు. 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 19 మంది కంటి రోగులకు పరీక్షలు ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు.

ఆగస్ట్ 5న జర్నలిస్టుల డిమాండ్స్ డే

మదనపల్లె రూరల్ : రాష్ట్రంలో జర్నలిస్టుల పెండింగ్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆగస్ట్ 5న రాష్ట్రవ్యాప్త డిమాండ్స్ డే పాటించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యవర్గ సమావేశం పిలుపునిచ్చిందని జాతీయ కౌన్సిల్ సభ్యులు బండపల్లె అక్కులప్ప, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వంశీధర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ నియమాల జీఓను వెంటనే విడుదల చేయాలని, పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రెడిటేషన్లు ఇవ్వాలని రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసిందన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించారన్నారు. అక్రెడిటేషన్ నియమాల జీఓ విడుదలలో జరుగుతున్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

అప్రమత్తతే దివ్యౌషధం

- అతిసారపై ప్రత్యేక జాగ్రత్తలు తప్పనిసరి
- సీజనల్ వ్యాధులతో ప్రమాదం
- కొనసాగుతున్న స్టాప్ డయేరియా ప్రోగ్రాం


జ్వర పీడితులకు రక్తనమూనా పరీక్షలను చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

రాయచోటి జగదాంబసెంటర్ : వాతావరణంలో తరచూ సంభవిస్తున్న మార్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షాకాలంలోనూ వేసవిని మరిపించే విధంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులు మరింత కాలం కొనసాగితే గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులతో పాటు అతిసార (డయేరియా) వ్యాప్తి చెందే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా లేకపోతే ఒక్కోసారి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. అతిసార వ్యాధి సాధారణంగా రెండు రకాలుగా వ్యాప్తి చెందుతుంది. అందులో నీళ్ల విరేచనాలు (నార్మల్ డయేరియా) మొదటిది కాగా, రెండవది రక్తం బంకతో వచ్చే విరేచనాలు (డిసెంట్రీ)గా వైద్య పరిభాషలో పిలుస్తుంటారు. చిన్నారుల్లో అతిసారకు రోటా వైరస్, పెద్దలకు వచ్చే అతిసారకు నోరో వైరస్ కారణమవుతుంది. దీంతో పాటు వివిధ రకాల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, బ్యాక్టీరియా, జీర్ణ ప్రక్రియ అస్తవ్యస్తం కావడం, ఆహారం విషపూరితంగా మారడం అతిసారకు కారణమవుతుంది. అతిసార సోకిన రోగులకు శరీరంలో నీటిశాతం, లవణాలు తగ్గిపోవడంతో పాటు విపరీతమైన నీరసం సంభవిస్తుంది. అతిసార రోగికి ఆ సమయంలో శరీరానికి అవసరమయ్యే లవణాలు అందించకపోతే డీ హైడ్రేషన్ ఎక్కువ పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. అతిసారతో బాధపడుతుండే చిన్నారులకు ఓరల్ డీ హైడ్రేషన్ సొల్యూషన్‌ను సత్వరమే అందించి సమీప ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సను అందిస్తే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చు. అలాగే అతిసారతో పాటు డెంగీ, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి జ్వరాలు కూడా ఈ సీజన్‌లో వేధిస్తుంటాయి.

అతిసార వ్యాధి లక్షణాలు

- అతిసార వ్యాధి విబ్రియో కామా, కలరా అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది.
- కలుషితమైన నీరు తాగడం
- శరీరంలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం
- పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, పారిశుధ్యం లోపించడం
- చిన్నారులకు తల్లిపాలు అందించలేకపోవడం

ఆహార నియమాలు

- జీర్ణమయ్యే ఆహారాన్ని మితంగా తీసుకోవాలి
- మసాలాలు, నూనెలు ఎక్కువగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండాలి
- కొబ్బరినీరు, ఎల్రక్టాల్ పొడి కలిపిన నీరు, నిమ్మరసం తాగాలి
- అతిసార వ్యాధి తగ్గినా కొన్ని రోజుల పాటు పౌష్టికాహారం తప్పనిసరి

పరిశుభ్రతతోనే అతిసార నివారణ



చిన్నారులకు సరైన రీతిలో తల్లిపాలను అందించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే అతిసార నివారణ సాధ్యమవుతుంది. ఇంట్లో మహిళలు వంట చేసే సమయంలోనూ, బిడ్డ మలమూత్రాలను తీసినప్పుడు చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలి. అతిసార సోకిన వ్యక్తులు అధికంగా సురక్షిత తాగునీటిని అధికంగా తీసుకోవాలి.

– డాక్టర్ డేవిడ్ సుకుమార్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల, రాయచోటి